

ఫార్మా కుంపటి!



టీఎస్‌ఐఐసీలోని ఖాళీ స్థలంలో ఫార్మా పరిశ్రమల నుంచి తెచ్చి కుప్పలుగా పోసిన వ్యర్థాలకు నిప్పుపెట్టిన దృశ్యాలు(ఫైల్)

● ఖాళీ స్థలాలనూ వదలని పరిశ్రమలు

- వ్యర్థాలను కుప్పలుగా పోసి నిప్పు
- హెచ్చరించినా మారని యాజమాన్యాల తీరు
- ఇదీ పోలేపల్లి సెజ్‌లోని పరిస్థితి
- కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నామంటున్న గ్రామస్థులు

జడ్చర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కలిగిన ఫార్మా పరిశ్రమల నుంచి వెలువడుతున్న నీటితో భూగర్భ జలాలు, పంట పొలాలు, చెరువులు, కుంటలు కాలుష్యం బారిన పడ్డాయి. ప్రస్తుతం అవే పరిశ్రమలు ఖాళీ స్థలాలను సైతం వదలడం లేదు. పరిశ్రమలలోని వ్యర్థాలను టీఎస్‌ఐఐసీ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో కుప్పలుగా పోసి నిప్పంటిస్తున్నారు. దీంతో పాటు వాతావరణం కలుషితమవుతోంది.

పంట పొలాలు, చెరువులు కాలుష్యం బారిన పడే విధంగా వ్యవహ రిస్తున్న ఫార్మా పరిశ్రమను కాల్చివేస్తానంటూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇటీవల హెచ్చరించినా వారని తీరు మారడం లేదు. విడతల వారీగా ఆ కుప్పలకు నిప్పంటిస్తున్నారు. దీంతో వ్యర్థాలను కాల్చడంతో వస్తున్న పొగతో రోగాల బారిన పడుతున్నామంటూ పోలేపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్ప టికే భూగర్భజలాలు కలుషితం అయ్యాయని, పంటలు పండించుకునేందుకు వీలులేని విధంగా వ్యవసాయ క్షేత్రాలు కాలుష్యం బారిన పడ్డాయని, చెరువులు-కుంటలలో పెంచుకుం టున్న చేపలు సైతం కాలుష్యం నీటితో మృతి చెందాయని వాపోతున్నారు. పోలేపల్లి గ్రామానికి అతి సమీపంలో ఉన్న టీఎస్‌ఐఐసీ ఖాళీ స్థలంలో వ్యర్థాలను డంపింగ్ చేయడం, నిప్పంటించడంతో వస్తున్న పొగ కారణంగా అనారోగ్యానికి గురవుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను వెంటనే అరికట్టాలంటూ వేడుకుంటున్నారు.



అలర్జీలకు గురవుతున్నాం

ఫార్మాపరిశ్రమల వ్యర్థాలను టీఎస్‌ఐఐసీలోని ఖాళీ స్థలంలో కుప్పలుగా పోసి నిప్పటించడంతో కాలుష్యం పొగతో ఇప్పటికే అలర్జీ వ్యాధులకు గురవు తున్నాం. పోలేపల్లి గ్రామానికి అతి సమీపంలో వ్యర్థాలను కాల్చుతుండడంతో వస్తున్న దుర్వాసనతో శ్వాసకోశ వ్యాధు లకు గురవుతున్నాం. వ్యర్థాలను కాల్చుతున్న స్థలానికి సమీపం లో శ్మశాన వాటిక ఉంది. అదే ప్రాంతంలో ఉన్న బోర్లలో నీరు క లుషితమవుతోంది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడి నప్పుడు ఆ బోర్ల నుంచే నీళ్ల సరఫరా చేస్తున్నారు. దీంతో ఆందోళనకు గురవుతున్నాం.

- కేశవాచారి, పోలేపల్లి



శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి

టీఎస్‌ఐఐసీలోని ఖాళీ స్థలంలో పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల నుంచి వ్యర్థాలను కుప్పలుగా పోసి నిప్పంటిస్తుండడంతో వచ్చే పొగతో ఇప్పటికే గ్రామంలో కొందరు శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారు. వ్యర్థాలను కాల్చవద్దన్న వారిపై ఫార్మా పరిశ్రమలకు చెందిన కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

- నక్కా రాఘవేందర్, పోలేపల్లి



దట్టంగా వచ్చే పొగతో తీవ్ర ఇబ్బందులు

వ్యర్థాలకు నిప్పంటించడంతో దట్టంగా వస్తున్న పొగతో గ్రామంలో బయట తిరగలేకపోతున్నాం. ఇప్పటికే భూగర్భజలాలు, పంటపొలాలు కలుషితం అయ్యాయి. సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల నుంచి పొడిగా ఉన్న వ్యర్థాలను టీఎస్‌ఐఐసీలోని ఖాళీ స్థలంలో కుప్పలుగా పోసి నిప్పంటిస్తున్నారు. ఈ కాలుష్యం బారిన పడి గ్రామస్థులు ఇప్పటికే అనారోగ్యానికి గురవుతున్నారు. పెద్ద ప్రమాదం జరగకుముందే నివారించాలి.

- యాదయ్య, పోలేపల్లి

పోలీస్ ఇమేజ్ పెరిగేలా

పౌరసేవలు అందించాలి

- ప్రజా భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- నేర సమీక్షలో ఎస్పీ జానకి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలకు ఎప్పుడూ జవాబుదారిగా ఉండాలని, పోలీస్ ఇమేజ్ పెరిగేలా పౌరసేవలు అందిం చాలని ఎస్పీ జానకి అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించి, వాటిని పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేరసమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో క్రైమ్ కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిస్థితి, యాక్సిడెంట్, మహిళలు, బాలలపై నేరాలు, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న మోసపూరిత చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను పరిష్కరించాలని, క్రైమ్‌కు సంబంధించిన అన్ని వివరాలను సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ సిస్టమ్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

అడిషినల్ ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్ బీ డీఎస్పీ రమణారెడ్డి, రూరల్ సీఐ గాందీనాయక్, టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్, జడ్చర్ల సీఐ కమలాకర్, నాగార్జునగౌడ్, భూత్పూర్ సీఐ రామ కృష్ణ, ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆబ్కారీ ఆదాయం రూ.165.72 కోట్లు



వనపర్తిలో మద్యం దుకాణాలకు దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- 227 దుకాణాలకు 5,524 దరఖాస్తులు
- గతం కంటే 36 శాతం తక్కువ
- ముగిసిన మద్యం టెండర్లు

6

స్వర్ణాభరణ భూషితుడు..

కురుమూర్తి రాయుడు

- బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టం
- 26న అలంకార ఉత్సవం

6



కురుమూర్తి స్వామి వారి బంగారు కిరీటం, హస్తాలు

ధాన్యం అక్రమ రవాణాకు కట్టడి

- వానాకాలం సీజన్ ప్రారంభం నేపథ్యంలో సరిహద్దులో నిఘా
- కర్ణాటక ధాన్యం రాకుండా చర్యలు
- నారాయణపేట జిల్లాలో ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటు
- పోలీస్, రెవెన్యూ యంత్రాంగం తనిఖీ

7



జిలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బాధితులకు అండ..

సైబర్ వారియర్స్

- ఇకపై పోలీస్ స్టేషన్‌లలో సేవలు
- నారాయణపేట జిల్లాలో 24 మంది విధులు

కోస్గి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. బాధితుల్లో చాలా మంది సామాన్య ప్రజలే ఉంటున్నారు. మోసపోయాక ఎవరికీ ఫిర్యాదు చేయాలో తెలియక చాలా జాప్యం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే అవగాహన లేక, టోల్ ఫ్రీ నంబరు సంప్రదించాలన్నది తెలియక డబ్బు పోగొట్టుకున్న బాధతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారికి సైబర్ వారియర్స్ మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు. సైబర్ నేరాల కట్టడికి రాష్ట్రంలోని ప్రతీ జిల్లా కేంద్రంలో డీ4సీ (డిస్ట్రిక్ట్ సైబర్ క్రైం సెల్) యూనిట్ ఉంటుంది.



కోస్గి పోలీస్‌స్టేషన్

సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే సౌకర్యం అన్ని ప్రాంతాల వారికి లేకపోవడంతో ప్రతీ పోలీస్ స్టేషన్‌లో సైబర్ వారియర్ వింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకొని పీఎస్‌కు ఇద్దరు వారియర్‌ల చొప్పున పోలీస్ శాఖ నియమించింది. వీరికి సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కల్పించారు. సాంకేతికంగా శిక్షణ ఇచ్చి కేసులను ఛేదించే విధంగా తర్ఫీదునిచ్చారు. మోసపోయిన డబ్బులు ఫ్రీజ్ చేయడంతో పాటు కోర్టుకు సంబంధించిన ఆదేశాలు బ్యాంకు అధికారులతో సంప్రదింపులు చేస్తూ బాధితులకు న్యాయం చేసేందుకు నిరంతరం పని చేస్తున్నారు. వీరికి 24 గంటలు సేవ లందించేందుకు సిమ్ కార్డులను కేటాయించారు. నారాయణపేట జిల్లాలోని 12 పోలీస్ స్టేషన్ల పరిధిలో 24మంది సైబర్ వారియర్స్ సేవ లందిస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్నాం..

సైబర్ నేరాలపై జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేపట్టాం. మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల పరిధిలోని బస్టాండ్లలో, కాలేజీలు, పాఠశాలల్లో పలు రకాల సైబర్ నేరాలపై ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 346 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. గోల్డెన్ అవర్‌లో (సైబర్ క్రైం జరిగిన వెంటనే) బాధితులు సమాచారం అందిస్తే రికవరీ సలభతరం అవుతుంది.

- డాక్టర్ వినీత్, ఎస్పీ, నారాయణపేట జిల్లా

వారియర్స్ విధులు..

బాధితులు మోసపోయిన గంటలోపు సంప్రదిస్తే కోల్పోయిన డబ్బులను ఫ్రీజ్ చేస్తారు. సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబరు 1930 సేవలు, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంపై అవగాహన కల్పిస్తారు. సైబర్ క్రైం పోర్టల్‌లో బాధితులతో ఫిర్యాదులు అప్‌లోడ్ చేస్తారు. ఫ్రీజ్ చేయించిన డబ్బులను తిరిగి బాధితులకు ఇప్పించే వరకు చర్యలు తీసుకుంటారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి నుంచి అక్టోబరు 23 వరకు 318 సైబర్ నేరాలు నమోదు అయ్యాయి. బాధితులు సైబర్ క్రైం కింద రూ. 85,65,827లు కోల్పోగా, రూ.28,50,249లు అధికారులు ఫ్రీజ్ చేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి రికవరీ చేసిన రూ. 16,84,528లు బాధితులకు అప్పజెప్పారు.

ప్రతీ రూపాయి విద్యకే ఖర్చు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి - విద్యానిధికి రూ.7.50 లక్షలు టీజీవోల విరాళం
- మొదటి నెల వేతనం అందజేసిన ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యానిధికి వచ్చే ప్రతీ రూపాయి పేద విద్యార్థుల విద్య కోసం ఖర్చు చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో విద్యానిధికి 27 ప్రభుత్వ శాఖల అధికారుల నుంచి సేకరించిన రూ.7.50లక్షల విలువైన చెక్కును కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. అలాగే ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తన మొదటి నెల జీతం రూ.లక్ష చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యా నిధి నిధులతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా డిజిటల్ లెర్నింగ్ సెంటర్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు. సామాజిక బాధ్యతా భావించి విద్యానిధికి విరాళాలు ఇచ్చిన టీజీవో ప్రతినిధులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.



రూ.7.50లక్షల చెక్కును ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ విజయేందిర బోయికి అందజేస్తున్న టీజీవో ప్రతినిధులు

టీజీవో ఉపాధ్యక్షుడు రామకృష్ణగౌడ్ మాట్లాడారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, రాష్ట్ర గజిటెడ్ అధికారుల సంఘం సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణగౌడ్, టీజీవో జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి వరప్రసాద్, ట్రెజరర్ టైటస్ పాల్, ఉపాధ్యక్షుడు శ్రీనుగౌడ్, శశికాంత్, జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాస్, ఏటీవో తానాజీ, డీపీఆర్‌వో శ్రీనివాస్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ గౌడ్, వ్యవసాయ శాఖ ఏడీ రామ్, వ్యవసాయ శాఖ ఏడీ రామ్‌పాల్ తదితరులు ఉన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

గండీడ్/మహమ్మదాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం గండీడ్ మండలంలోని వెన్నచేడులో ఉన్న మాడల్‌స్కూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచే సాంకేతిక విద్యలో రాణిస్తేనే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పాఠశాలలో గల సైన్స్, ఆస్ట్రో ల్యాబ్‌లను పరిశీలించి అక్కడ ఉన్న పరికరాలను ఎలా ఉపయోగించాలి, వాటి ద్వారా మున్ముందుగల ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటిస్తున్నారా? భోజనం రుచికరంగా ఉందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. క్రీడా ప్రాంగణాన్ని మెరుగుపరచాలని, గ్రామం నుంచి పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలతోపాటు 8 గ్రామాలకు గత ఇరవై రోజుల నుంచి రంగారెడ్డిపల్లి దగ్గర పైప్‌లైన్ పగలడం వలన మిషన్ భగీరథ నీరు రావడం లేదని తెలిపారు. దీనికి సంబంధిత ఈఈ చల్మారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాటిని వెంటనే సరిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ మల్లిఖార్జున్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిచంద్రారెడ్డి, మండల విద్యాధికారి జనార్దన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెన్నచేడు మోడల్ స్కూల్‌లోని ఆస్ట్రోల్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

● గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మహమ్మదాబాద్ మండలంలోని లింగాయిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాల శిబిరాన్ని పరిశీలించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి మధుసూదన్ గౌడ్, వెటర్నరీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గురువారం విద్యాశాఖతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్, జిల్లా విద్యా అధికారి గోవిందరాజు పాల్గొన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, పాఠశాలల్లో సక్రమమైన శిక్షణ వాతావరణం ఏర్పరచడం లక్ష్యంగా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, ఆత్మ విశ్వాసం పెంపొందించడం లక్ష్యంగా నవంబరు 14న జిల్లా స్థాయి స్పెల్ బీ, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల స్థాయి, మండల స్థాయి పోటీలు పూర్తి చేసిన అనంతరం ఉత్తమ విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేయాలని ఆమె సూచించారు. కేడీపీ పరిధిలోని 19 పైలట్ పాఠశాలలు, జిల్లాలోని 16పీఎంశ్రీ పాఠశాలల్లో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కేజీబీవీలు, టీజీఎంఎస్ పాఠశాలలు, హాస్టళ్లలో ఆస్ట్రానమీ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 125.00
హోల్ సేల్	: 134.00
డ్రెస్డ్	: 213.00
స్కిన్ లెస్	: 243.00

నేటి నుంచి

ఎస్ఏ-1 పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షల మంది విద్యార్థులు

7

కనుల పండువగా

ప్రతిష్ఠాపన ఉత్సవాలు

- మహబూబ్‌నగర్ పట్టణంలో విగ్రహాల ఊరేగింపు

6

మిత్రుడికుటుంబానికి రూ.లక్ష సాయం


మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

వెల్దండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వెల్దండ మాజీ ఉపసర్పంచ్ చిమ్ముల శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి అతని చిన్ననాటి స్నేహితులు బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా 1991-92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి స్నేహితులు తమవంతుగా రూ.1.2లక్షల నగదు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. తోటి మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని, అతని కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో దామోదర్, నాగేశ్వర్ గౌడ్, జంగారెడ్డి, లక్ష్మి, వనజాత, గిరిజ, హలీం, జగన్, రవీందర్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మణ్, దూంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం


శ్రీశైలం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

తెలకపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీశైలం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం తోటి ఆర్టీసీ కార్మికులు 90,500 రూపాయలు జమ చేసి బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మాలధారణ


ఉమామహేశ్వరంలో హనుమాన్ మాలధారణ స్వీకరించిన భక్తులు

కందనూలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన భక్తులు, యువత గురువారం ఉమామహేశ్వరంలో గురుస్వామి జయరాం ఆధ్వర్యంలో మండల హనుమాన్ దీక్షా మాలధారణ స్వీకరించారు. హనుమాన్ భక్తులు రాంబంటు సన్నిధిలో భక్తిశ్రద్ధలతో మండలం రోజులు హనుమంతునికి ప్రత్యేక దీక్షాతో పూజలు చేయనున్నట్లు గురుస్వామి ఎం.బాలస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి అయ్యప్పరెడ్డి, స్వాములు ప్రశాంత్, రాములు, వెంకటేశ్, శంకర్, వేణు ఇతర స్వాములు దీక్ష స్వీకరించారు.

ఘనంగా మహబూబ్ సుభాని గంధోత్సవం


యాపట్లలో దర్గా దగ్గర ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యాపట్ల గ్రామంలో గార్వీ మహబూబ్ సుభాని గంధోత్సవాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో గంధోత్సవాన్ని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా దగ్గరకు తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు నిరంజన్, సలావుద్దీన్, జహంగీర్, సాదిక్, పరువాన్, నిజాం, మునీర్, మజీద్, బహిర్, సలీం, మాసుమ్, ఆసిఫ్, ఖదీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ పరిశ్రమ పరిశీలన

బాలానగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి పంచాయతీ శివారులోని హరి ఓం ఐరన్ పరిశ్రమను తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యంతో పెద్దాయపల్లి, సేరిగూడ గ్రామాల భూములు సాగుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో పెద్దాయపల్లి శేరిగూడ గ్రామాలకు చెందిన రైతులు రాజిరెడ్డి, సత్తయ్యగౌడ్, శ్రీధర్‌రెడ్డిలతో పాటు మరి కొందరు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేశారు. అలాగే ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. ఈ మేరకు తహసీల్దార్ పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యకారక నీటిని నల్లని పదార్థాలను కాలుష్యం బారిన పడిన సాగు భూములను పరిశీలించారు. కాలుష్యానికి గురైన తమ భూములను రైతులు తహసీల్దార్‌కు చూయించారు. సమగ్ర విచారణ అనంతరం ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు.

రోడ్డుపైకి కొండచిలువ


మానవపాడుకు వచ్చే దారిలో కొండచిలువ

మానవపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని జాతీయ రహదారి-44 నుంచి మానవపాడు మండల కేంద్రానికి వచ్చే డబుల్ రోడ్డుపై ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో భారీ కొండచిలువ గురువారం రాత్రి కనిపించింది. దీన్ని చూసిన ప్రయాణికులు, గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. మూడు నెలల క్రితం అదేరోడ్డుపై సంచరించగా, మళ్లీ ఇప్పుడు కనిపించిందని అటువైపు వెళ్లే రైతులు తెలిపారు.

స్వర్ణాభరణ భూషితుడు..
కురుమూర్తి రాయుడు

» బ్రహ్మోత్సవాల్లో తొలి ఘట్టం
» 26న అలంకార ఉత్సవం

చిన్నచింతకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి ఘట్టమైన అలంకారోత్సవం ఈనెల 26న ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి అధికారులు, పాలకవర్గం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. తొలి ఘట్టం నుంచే స్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ మరింత పెరిగి, జనసంద్రంగా మారే అవకాశం ఉంది.


స్వామి వారి శంఖు చక్రం


పళ్లెంలో ఉంచిన బంగారు ఆభరణాలు

స్వామి వారి ఆభరణాల ఊరేగింపు

ముక్కెర వంశపు రాజుల కాలం నాటి స్వామి వారి ఆభరణాలు ఆత్మకూరు ఎస్‌బీఐలో భద్రపరిచి ఉంచిన వాటిలో బంగారు కిరీటం, కోర మీసం, హస్తాలు, భుజకీర్తులు, శంకు, చక్రాలు, పచ్చలతో పొదగబడిన వివిధ రకాల హారాలు, వజ్ర, వైడూర్యాలతో కూడిన ముత్యాల హారాలు, బంగారు ములగజ్జలు ఇంకా భక్తులు సమర్పించిన వివిధ రకాల ఆభరణాలతో కూడిన పెట్టెను ఆనవాయితీగా లాకర్ నుంచి బయటికి తీసుకువస్తారు. గాడి వంశానికి చెందిన స్వర్ణకారులు స్వామి వారి ఆభరణాల పెట్టెను తలపై ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు మధ్య ఊరేగింపు ఆత్మకూరు పట్టణంలో పెద్ద ఎత్తున చేపడుతారు. దీంతో అడుగడుగునా పూల వర్షం కురిసే విధంగా భక్తులు పూలను చల్లుతారు. పరమేశ్వర స్వామి చెరువు కట్ట మీదుగా మదనాపురం మండలం కొత్తపల్లి, దుప్పల్లి గ్రామాలకు చేరుకుంటాయి. ఇక్కడ పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతారు. చాలా వరకు భక్తులు నెమలి కట్టలను చేతబట్టి, బంతిపూలను మెడలో వేసుకుంటారు. అమ్మపూర్ గ్రామానికి మధ్యాహ్నం స్వామి వారి ఆభరణాలు చేరుకుంటాయి. అక్కడ ముక్కెర వంశపు రాజు వంశానికి చెందిన శ్రీరాంభూపాల్ నివాసంలో దాదాపు రెండు గంటల పాటు ఆనవాయితీ ప్రకారం అర్చకులు ఆధ్వర్యంలో భక్తులు కూడా పెద్ద ఎత్తున వాటిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మాపూర్ గ్రామం గుండా ఆభరణాలు ఊరేగింపు జాతర మైదానానికి సాయంత్రం చేరుకుంటుంది. స్వామి వారి రాజగోపురం నుంచి మెట్ల దారి గుండా ఆభరణాలు కాంచన గుహలోని గర్భగుడి ఎదుట ఉంచుతారు. అక్కడ ఆభరణాలను ఒక్కొక్కటి తీసి, అధికారుల సమక్షంలో పరిశీలించి రాత్రికి అర్చకుల ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు మధ్య స్వామి వారికి అలంకరిస్తారు. దీంతో స్వామి వారు సువర్ణ భూషితుడై బంగారు కాంతులతో దగదగలాడుతూ కాంచన గుహ మెరుస్తుంది.

హంస వాహన సేవలో స్వామి వారు

అమ్మాపూర్ సమీపంలో వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి గురువారం రాత్రి హంస వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపులో అడుగడుగునా గోవింద నామస్మరణతో కురుమూర్తి గిరిలు పులకించిపోయాయి.


హంసవాహన సేవలో ఊరేగుతున్న కురుమూర్తి రాయుడు

కురుమూర్తి జాతరకు 270 ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కురుమూర్తి స్వామి జాతరకు 270 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొత్తకోట, పెబ్బేరు, దేవరకద్ర, ఆత్మకూర్ ఇతర ప్రాంతాల నుంచి బస్సులను నడుపు తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం దృష్ట్యా ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండబోతుందని, అసౌకర్యం కలగకుండా బస్టాండ్లలో, కురుమూర్తి దేవస్థానం వద్ద ప్రత్యేక శిబిరాలు, తాగునీటి వసతి, టెంట్లు, ప్రయాణికులకు సహకరించడానికి వలంటీర్లను ఏర్పా టు చేసినట్లు తెలిపారు.

దేవరకద్ర: కురుమూర్తి జాతరకు దేవరకద్ర నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు నారయణపేట డీఎం లావణ్య తెలిపా రు. గురువారం ఆమె దేవరకద్ర బస్టాండ్‌ను పరిశీలించారు. నారాయణపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులను వారం రోజుల పాటు నడుస్తాయని పేర్కొన్నారు.

అర్హులకు విత్తనాలు పంపిణీ చేయాలి

» జాతీయ రహదారిపై రైతులు, బీజేపీ నాయకుల రాస్తారోకో

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో అర్హులైన రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయకుండా అధికార పార్టీకి చెందిన వారికి అధికారులు పెద్దపీట వేస్తున్నారని పెద్దకొత్తపల్లి మండల బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పరశురామ్ ఆధ్వర్యంలో గురువారం రైతులతో కలిసి మండలంలోని చంద్రకల్ గ్రామంలో నాగర్‌కర్నూల్-కొల్లాపూర్ మధ్య 167కె జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో గంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం నూనె విత్తనాల ఉత్పత్తిని పెంచాలని ఉద్దేశంతో వందశాతం సబ్సిడీతో అర్హులైన రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. కానీ ఇక్కడ పరిస్థితి వేరుగా ఉందని ఆరోపించారు. ఏఎస్ఐ బాలనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి విరమింపజేశారు. కార్యక్రమంలో జలాల్ శివుడు, బెల్లి తిరుమల్‌యాదవ్, భీమేష్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, నాగరాజు, జగన్, విజయ్, రైతులు పాల్గొన్నారు.


చంద్రకల్ దగ్గర జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

వంగూరు: మండలంలోని చౌదర్‌పల్లిలో గురువారం సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన ఓ రైతు కొందరి రైతుల పేరుతో వంద క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు తెచ్చుకొని తమ దుకాణంలో నిల్వ ఉంచడంతో రైతులు ఆందోళన చేపట్టారు. తమ రాజకీయ పలుకుబడితో సబ్సిడీ వేరుశనగ విత్తన బ్యాగులు నిల్వ ఉంచాడని రైతులు జంగయ్య, పరశురాములు, వెంకటయ్య, కాశీనాథం, నరేందర్ ఆరోపించారు. వెంటనే అధికారులు విచారణ చేసి బ్యాగులను రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

చదువుతోపాటు ప్రభుత్వ సేవలు తెలుసుకోవాలి

» జోగులాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు పోలీస్, ప్రభుత్వం అందిస్తున్న సేవలను తెలుసుకొని వినియోగించుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్ సందర్శనకు వచ్చిన ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులతో ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలై అవగాహన పెంచుకోవాలన్నారు. గతంలో సైబర్ నేరాలు, మహిళలపై ఈవ్‌టీజింగ్ జరిగేవి కాదని, కాలానుగుణంగా నేర ప్రవృత్తి మారుతుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతకాలంలో మహిళలు, విద్యార్థినులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వారి కోసం ప్రభుత్వం, పోలీస్‌శాఖ అందిస్తున్న షీటీం, భరోసా, సఖి సెంటర్ సేవలను తెలుసుకొని అత్యవసర సమయాల్లో డయల్ 100, 8712670312కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శంకర్, సీఐ టి. శ్రీను, ఎంఏఎల్‌డీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

కనులపండువగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న అర్చకులు


సామూహిక హోమాలలో పాల్గొన్న భక్తులు

» మహబూబ్‌నగర్ పట్టణంలో విగ్రహాల ఊరేగింపు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గౌడ కులస్థుల ఆరాధ్య దైవం కంఠమహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠపన పూజా కార్యక్రమాలు కనులపండువగా సాగాయి. నగరంలోని ఏనుగొండ దేవునిగుట్టపై కొత్తగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రారంభం సందర్భంగా ప్రాతఃకాలంలో సుప్రభాతసేవ, వేద పారాయణం, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్ష స్వీకారం, అఖండ దీప స్థాపన, సర్వతో భద్ర మండల దేవతల ఆవాహన పూజ, వాస్తుపూజ, గణపతిహోమం, ఆవాహిక పీఠదేవతల హోమ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం దేవతా మూర్తుల విగ్రహాలను గ్రామోత్సవం, అష్టదిగ్బంధనం, జలదివాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను ఊరేగింపు చేపట్టారు. శుక్రవారం కౌండిన్య మహర్షి కంఠమహేశ్వర స్వామి, సురమాంబ దేవి, కల కోడిపుంజు దేవత, వనం ఎల్లమ్మ దేవత, వనం మైసమ్మ దేవత, పోతరాజు, శివలింగం, నంది, మహాగణపతి విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. సాయంత్రం ఏనుగొండ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బోనాల ఊరేగింపు నిర్వహిస్తుండగా, కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన జోగిని శ్యామల పాల్గొననున్నారు.

ఆబ్కారీ ఆదాయం రూ.165.72 కోట్లు

» 227 దుకాణాలకు 5,524 దరఖాస్తులు
» గతం కంటే 36శాతం తక్కువ
» ముగిసిన మద్యం దుకాణాలకు టెండర్లు


మహబూబ్‌నగర్‌లో దరఖాస్తులు దాఖలు చేస్తున్న వ్యాపారులు

జిల్లా	దరఖాస్తులు
మహబూబ్‌నగర్	1,634
నారాయణపేట	853
గద్వాల	774
వనపర్తి	757
నాగర్‌కర్నూల్	1596

మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాలకు ఎట్టకేలకు టెండర్ల గడువు ముగిసింది. ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ప్రభుత్వం మరో ఐదు రోజుల గడువు పొడిగించింది. ఈ ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో 336 టెండర్లు అదనంగా వచ్చాయి. మొత్తంగా 227 మద్యం దుకాణాలకు 5,524 టెండర్లు దాఖలయ్యాయి. ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు కాగా టెండర్ల రూపంలో ప్రభుత్వానికి రూ.165.72 కోట్ల ఆదాయం సమకూరింది. 2023తో పోలిస్తే 36 శాతం దరఖాస్తులు తగ్గిపోయాయి. మద్యం టెండర్లను గతేడాదికన్నా పెంచాలని ఎక్సైజ్‌శాఖ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గతంలో టెండర్లు వేసిన వ్యాపారులు చాలామంది ఈసారి ముఖం చాటేయడంతో టెండర్ల ప్రక్రియ మందకొడిగా సాగింది. రియల్ ఎస్టేట్ ప్రభావం మద్యం టెండర్లపై తీవ్రంగా చూయించినట్లు స్పష్టమవుతోంది. దీనికితోడు ఏపీ వ్యాపారులు తెలంగాణ వైపు ఆసక్తి చూయించపోవడం కూడా టెండర్లు తగ్గడానికి కారణమైందని యంత్రాంగం భావిస్తోంది. టెండర్ల ప్రక్రియ ముగిసినందున ఈనెల 27న లక్కీడిప్ నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల కలెక్టరేట్ సముదాయాలలో కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీడిప్ ప్రక్రియను చేపట్టనున్నారు. అదృష్టం వరించిన వారికి దుకాణాలను కేటాయించనున్నారు. దుకాణాలు దక్కించుకున్నవారు దుకాణం లైసెన్స్ ఫీజులో 1/6వ వంతు చెల్లించాల్సి ఉంటుంది.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలు


మద్దూరులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

మద్దూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూరులో అండర్-17 ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో 12 మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో మొదటి బహుమతిని దామరగిద్ద జట్టు కైవసం చేసుకోగా, బాలుర విభాగంలో ధన్వాడ ప్రథమ బహుమతిని, అలాగే దామరగిద్ద ద్వితీయ బహుమతిని సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం సవిత, బాల్‌రాజ్, అనంతసేన, రామకృష్ణ, సాయినాథ్, రవికుమార్, రాజేశ్వరి, కృష్ణవేణి, రఘు, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీలో విచారిస్తున్న అధికారులు

ఉప్పునుంతల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అడిషనల్ డీఆర్‌డీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు చేపట్టిన 555 వివిధ పనులకు గాను రూ.5,11,93,259 ఖర్చుపై సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలను ఎస్ఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోలర్ కృష్ణారావు, అరవింద్, జిల్లా విజిలెన్స్ అధికారులు నసీరుద్దీన్, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు, సామాజిక తనిఖీ ఎంపీడీవో మోహన్‌లాల్, ఎంపీవో వెంకటేశ్, ఏపీవో పర్వతాలు, ఈసీ కుర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ స్కూల్ టీచర్లకు ఐడీలు

» ఒక్కొక్క కార్డుకు రూ.75
» పీఎంశ్రీ పాఠశాలలకు నిధులు మంజూరు చేసిన సమగ్రశిక్ష
» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 పీఎంశ్రీ పాఠశాలలు
» 1,940 మంది ఉపాధ్యాయులు



కోటకొండలోని జడ్పీహెచ్ పీఎంశ్రీ స్కూల్

నారాయణపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పీఎంశ్రీ స్కూల్‌లలో పనిచేసే ఉపాధ్యాయులకు ఐడీ కార్డులు జారీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 2025-26 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ అక్టోబరు 9న జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందాయి. ఐడీ కార్డుల కోసం ఒక్కొక్క దానికి రూ.75 ప్రకారం పీఎంశ్రీ పాఠశాలలకు నిధులు మంజూరు చేసింది. దాంతో త్వరలో పీఎంశ్రీ స్కూల్ ఉపాధ్యాయులందరికీ ఐడీ కార్డులు అందనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 134 పీఎంశ్రీ స్కూళ్లకు గాను 1940 మంది ఉపాధ్యాయులు ఉండగా వారికి ఐడీ కార్డుల కోసం రూ.1,45,500 నిధులు మంజూరయ్యాయి.

జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	నిధులు
జోగుళాంబ గద్వాల	22	400	రూ.30,000
మహబూబ్‌నగర్	26	478	రూ. 35,850
నాగర్‌కర్నూల్	27	428	రూ. 32,100
నారాయణపేట	19	327	రూ. 24,525
వనపర్తి	21	307	రూ. 23,025
మొత్తం	134	1940	రూ.1,45,500

క్రైం కార్నర్

లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పద మృతి

కల్వకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ఓ లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం తీగలపల్లి గ్రామానికి చెందిన గోపాల మల్లయ్య (45) భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో ఆయన గ్రామంలో కాకుండా ఇతర ప్రాంతాలల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కల్వకుర్తి పట్టణంలోని భారత్ లాడ్జికి బుధవారం రాత్రి వచ్చాడు. గురువారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి అన్న గోపాల లింగం మృతిపై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండవ ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

వడ్డేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీలోని శాంతినగర్‌కు చెందిన వరలక్ష్మి(36) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. 14 ఏళ్ల క్రితం కర్నూలు జిల్లా గూడూరు గ్రామానికి చెందిన రాజశేఖర్‌తో వివాహమైంది. ఏడాది క్రితం భర్తతో గొడవపడి శాంతినగర్‌లోని తన అన్న వద్ద నివాసం ఉంటుంది. వారం రోజుల నుంచి గుండెనొప్పి రావడంతో ఆస్పత్రికి వెళ్లి చూయించుకోగా డబ్బులు ఎక్కువ అవుతాయన్న ఉద్దేశంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అన్న మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సూరాపూర్ పాఠశాలలో చోరీ

లింగాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని సూరాపూర్ ప్రభుత్వ పాఠశాలలో దొంగలు పడ్డ ఘటన గురువారం వెలుగు చూసింది. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గది తాళాలు పగలగొట్టారు. వంట సామాగ్రి, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం పర్వతాలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు.

బాల్య వివాహంపై ఫిర్యాదు

కోడేరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో బాల్య వివాహంపై గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గా ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. ఏదుల మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక మండల కేంద్రంలో తన తాతగారి ఇంటి వద్ద ఉండి చదువుకుంటుంది. ఆ అమ్మాయికి పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో ఈ నెల 2న వివాహం జరిపించారు. ఓ వ్యక్తి ఒకరు 1098కు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన అధికారులు బాలికను బాల రక్ష భవన్‌కు తరలించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరు చౌరస్తా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని అలంపూరు చౌరస్తాలో గురువారం పోలీసు సిబ్బంది రవి, ఖాదర్ తనిఖీ చేస్తుండగా ఓ లారీని పట్టుకున్నారు. అందులో ఇసుక ఉండటంతో డ్రైవర్‌ను విచారించేందుకు ప్రయత్నించగా అతడు పారిపోయాడు. అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

మైనింగ్ లారీకి జరిమానా

మూసాపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు ఆలయం వద్ద ఇటీవల మైనింగ్ బండరాళ్లను తరలిస్తున్న లారీని బీజేపీ నాయకులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ శేఖర్ ఆదేశాల మేరకు గురువారం మైనింగ్ శాఖ అధికారులు బండరాళ్ల లారీని పరిశీలించి రూ.70 వేల జరిమానా విధించగా, చలాన్ కట్టడంతో లారీని వదిలేశామని తహసీల్దార్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

» ఆరుగురిపై కేసు నమోదు



పోలీసుల దాడుల్లో పట్టుబడిన నగదు

మద్దూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నా రాయణపేట జిల్లా మద్దూర్ మండలంలో ని పెదిరిపాడ్ శివారు లో పేకాట స్థావరంపై గురువారం రాత్రి టా స్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించా రు. రూ.41 వేల నగ దు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వా ధీనం చేసుకున్నట్లు ఎ స్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అమాయకులే లక్ష్యం

» ఏటీఎం కార్డులు ఏమార్చి.. డబ్బులతో జల్సాలు



నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మహమ్మదాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కేంద్రాల వద్ద అమాయకులను ఆసరాగా చేసుకొని మోసగిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ పోలీసులు తెలిపారు. గురువారం ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి నిందితుడిని విలేకరుల ఎదుట ఉంచి వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కావలి చెన్నయ్య జల్సాలకు అలవాటుపడి ఏటీఎం కేంద్రాల వద్ద అమాయకులను ఆసరా చేసుకుని సహాయం చేస్తున్నట్లు నటించేవాడు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న వేరే ఏటీఎం కార్డులను మార్చి ఇచ్చి అసలు కార్డు ద్వారా వారి డబ్బులను డ్రా చేసుకునేవాడు. ఈ క్రమంలో ఏప్రిల్ నెలలో మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో పని చేస్తున్న శంకరయ్య కార్డు మార్చి రూ.57,800, బొమ్మికుంటతండాకు చెందిన రవి కార్డు ద్వారా రూ.30వేలు, సెప్టెంబరు 8న లింగాయిపల్లితండాకు చెందిన వ్యక్తి కార్డు ద్వారా రూ.28,500 డ్రా చేశాడు. ఇతనిపై గతంలో మహబూబ్‌నగర్ టూటౌన్, కొడంగల్, కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు. అతని నుంచి ఒక బైక్, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

బాలిక అదృశ్యం

తిమ్మాజిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏళ్ల తరబడి నరకయాతన

» మరమ్మతులకు నోచుకోని రహదారులు
» రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
» నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం
» కనీస మరమ్మతు చేపట్టాలంటున్న వాహనదారులు



వనపర్తి నుంచి పెద్దమందడి వెళ్లే మనిగిల్ల వద్ద గుంతలతో అధ్వానంగా మారిన రహదారి



జగత్‌పల్లి నుంచి మనిగిల్ల గ్రామానికి వెళ్లే దారి

వనపర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పాటు, భారీ వాహనాల రాకపోకలకు జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయి. నెలలో పదుల సంఖ్యలో వాహనదారులు రోడ్లపై ఏర్పడిన గుంతలలో పడి మృత్యువాత పడడంతో పాటు గాయాల పాలవుతున్నారు. ఈ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

టెండర్లు పూర్తయినా..

వనపర్తి నుంచి పెద్దమందడి వెళ్లే రహదారి ఏళ్లుగా గుంతలమయంగా మారింది. జగత్‌పల్లి, మణిగిల్ల వద్ద గుంతలుగా ఏర్పడి నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని నెలల క్రితం తాత్కాలికంగా మరమ్మతు చేపట్టినా ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డు మరమ్మతుకు రూ.40 కోట్లు మంజూరు కాగా ఇటీవలే టెండర్లు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. అదేవిధంగా వనపర్తి నుంచి పెబ్బేరు వెళ్లే రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవలే ఒక యువకుడు తిరుమలయ్య గుట్ట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి మృతి చెందాడు. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టడానికి అటవీ శాఖ అనుమతులు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ రోడ్డు విస్తరణకు అనుమతులు ఇచ్చినట్లు సంబంధిత అటవీశాఖ అధికారుల నుంచి సమాచారం. అదే విధంగా ఆత్మకూరు మండల కేంద్రం నుంచి మూలమల్ల గ్రామం మీదుగా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలు గుంతలుగా ఏర్పడింది. 2016 కృష్ణా పుష్కరాల నిమిత్తం మంజూరైన రోడ్డు మరమ్మతు 11 కిలో మీటర్ల మేర రూ.8 కోట్ల 30 లక్షల తో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ప్రస్తుతం ఎక్స్‌కవేటర్ సహాయంతో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని తాత్కాలికంగా మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు చేపడుతున్నారు. అదేవిధంగా వనపర్తి నుంచి ఖిల్లాఘణపూర్ వెళ్లే ప్రధాన రహదారి కూడా అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో వందల సంఖ్యలో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన అవి కొన్ని రోజులకే గుంతలుగా ఏర్పడుతున్నాయి.

జిల్లాలో 85 కిలో మీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లు

జిల్లా వ్యాప్తంగా 85 కిలో మీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ఈ రోడ్ల కనీస మరమ్మతుల కోసం రూ.66 లక్షల నిధులు మంజూరు అవసరమని ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. అదే విధంగా దెబ్బతిన్న రోడ్లను పూర్తిస్థాయిలో కొత్త రోడ్లు వేయాలంటే రూ.9కోట్ల75 లక్షలు అవసరం పడుతుందన్నారు. ప్రతిపాదనలన్నింటిని కూడా ప్రభుత్వానికి పంపామని నిధులు మంజూరు అవ్వగానే రోడ్ల మరమ్మతులతో పాటు అవసరమైన చోట కొత్త రోడ్ల నిర్మాణానికి చేపడతామని సంబంధిత పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

పెండింగ్‌లో కాజ్‌వే, బ్రిడ్జి పనులు

మదనాపూర్, పెద్దమందడి, శ్రీరంగాపూర్, వనపర్తి, వీపనగండ్ల మండలాల్లో కాజ్‌వే బ్రిడ్జిల నిర్మాణ పనులు కూడా చాలా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల మరమ్మతులతో పాటు పెండింగ్‌లో ఉన్న కాజ్‌వే బ్రిడ్జిల నిర్మాణ పనులను ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రోడ్ల మరమ్మతు కోసం నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం అక్రమ రవాణాకు కట్టడి

» వానాకాలం సీజన్ ప్రారంభం నేపథ్యంలో సరిహద్దులో నిఘా
» కర్ణాటక ధాన్యం రాకుండా చర్యలు
» నారాయణపేట జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు
» పోలీస్, రెవెన్యూ యంత్రాంగం తనిఖీ



కృష్ణ మండలంలోని చేగుంట చెక్‌పోస్టు వద్ద పోలీసుల పహారా

నారాయణపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ధాన్యం పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోని జిల్లాలోకి రాకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తుంది. దీంతో కర్ణాటక రాష్ట్రం నుంచి రాష్ట్రంలోని జిల్లా సరిహద్దులోకి ధాన్యం రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు గురువారం ఎస్పీ వినీత్ తెలిపారు. జిల్లా సరిహద్దులో నారాయణపేట మండలం జలాల్‌పూర్, దామరగిద్ద మండలం కాన్‌కుర్తి, కృష్ణ బ్రిడ్జి వద్ద, కృష్ణ మండలం చేగుంట, ఉజ్జెల్లి, ఊట్కూర్ మండలం సమస్తపూర్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేసి ధాన్యం రాకుండా పటిష్ఠ నిఘా ఉంచనున్నారు.

ప్రతీ చెక్‌పోస్టు వద్ద ఇద్దరు పోలీసులు, ఒక రెవెన్యూ అధికారి తనిఖీ చేస్తున్నారు. అలాగే జిల్లా నుంచి రేషన్ బియ్యం అక్రమంగా తరలించకుండా దృష్టి సారించారు. వాహనాలను తనిఖీ చేసి రిజిస్టర్‌లో నెంబర్లు, ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాయనే వివరాలు పొందుపరుస్తున్నారు. అయితే రవాణా శాఖకు సంబంధించి జిల్లాలోని కృష్ణ బ్రిడ్జి వద్ద ఉన్న చెక్‌పోస్టును ఎత్తివేశారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

» ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షల మంది విద్యార్థులు



మహబూబ్‌నగర్‌లోని వెంకటేశ్వర కాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు సమ్మేటివ్ అసిస్మెంట్ పరీక్షలు-1 (ఎస్‌ఏ) ప్రారంభం కానున్నాయి. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 2025-26 ఏడాదికి గాను ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, కేజీబీవీ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తప్పని సరిగా డీసీఈబీ ద్వారా రూపొందించిన ప్రశ్నాపత్రాలనే వినియోగించాలనే నిబంధన అమలులో ఉంది. ప్రైవేట్ పాఠశాలలో 1 నుంచి 5 తరగతి వరకు సొంత ప్రశ్నపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్న విషయంపై అధికారులు పలుమార్లు హెచ్చరించిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నవంబరు 3న ఫలితాలు వెల్లడించి, 4వ తేదీన ఆన్‌లైన్‌లో నివేదించి, 15న తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,557 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3.50లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రానున్నారు. ఇప్పటికే డీసీఈబీలు తయారు చేసిన పరీక్ష పత్రాలను కాంప్లెక్స్ పాఠశాలకు నుంచి పాఠశాలకు తీసుకెళ్లారు. ప్రైవేట్ పాఠశాలలో కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీసీఈబీ పరీక్ష పత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ అన్ని చర్యలు చేపట్టింది.

డీసీఈబీ ప్రశ్నపత్రాలే వాడాలి

విద్యాశాఖ సూచించిన ప్రకారం అన్ని పాఠశాలల్లో తప్పని సరిగా డీసీఈబీ రూపొందించిన ప్రశ్నపత్రాలు తప్పని సరిగా వాడాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం. విద్యాశాఖ సూచించిన సమయానుసారం పరీక్షలు నిర్వహించాలి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించాం.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

» టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం

ఆత్మకూరు/ అమరచింత, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో కలిసి భవన నిర్మాణ కార్మికుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు సహజ మరణం ప్రమాద బీమా, వివాహ, ప్రసవం వంటి సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదన్నారు. దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్న ఇప్పటికీ నిధులు లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలో జమ కావడం లేదన్నారు. తక్షణమే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ సకాలంలో సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా పాలక ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, సాంబశివుడు, హనుమంతు, రాజు, కిరణ్, ప్రసాద్, రాము, నరసింహ పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు బాలమణి

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్నా నేటికీ ఆ హామీ నెరవేర్చలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, కార్యదర్శి బాల్‌రామ్‌లు మండిపడ్డారు.

గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆశా కార్యకర్తల యూనియన్ జిల్లా మహాసభలు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు బాలమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరై, మాట్లాడారు. కేంద్రం పెంచిన పారితోషికాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా యధావిధిగా అమలు చేయాలన్నారు. సభ ప్రారంభ సూచికంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం ఇటీవల మరణించిన ఆశా కార్యకర్తలకు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి కాశప్ప, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు నరహరి, పవన్, ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ సైనికులకు సన్మానం



సైనికులను సన్మానిస్తున్న తోటి సైనికులు

వెల్దండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పోరాడి తొలిసారిగా స్వగ్రామానికి వచ్చిన సైనికులకు నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన ద్యాప విజయ్‌కుమార్, మట్ట విజేందర్‌గౌడ్ సెలవుపై వెల్దండకు వచ్చారు. గ్రామం నుంచి ఎంతోమంది సైన్యంలో పనిచేయడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మట్ట చంద్రశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తమాచారి, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, శరత్‌గౌడ్, శ్రీనివాసులు, గణేశ్, విష్ణుగౌడ్, ప్రసాద్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు ఈ నెల 28, 29, 30 వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు రాఘవచారి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులతో కలిసి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పీడీఎస్‌యూ 50 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. మహాసభలకు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీ.హరగోపాల్ ముఖ్యఅతిథిగా, వక్తలుగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాసిం, హైకోర్టు అడ్వకేట్ కుర్రా జితేంద్రబాబు, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ, తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, సాంబశివరావు, ప్రశాంత్, విజయ్, వెంకట్, శివ, వివేక్, అఖిలేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలి

» పశువైద్యాధికారి శివరాజ్



మిడ్జిల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాడి రైతులు నూతన యాజమాన్య పద్ధతులు పాటించి ఎప్పటికప్పుడు పశుసంవర్ధక శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని మండల పశువైద్యాధికారి అనుప శివరాజ్ అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

ఎన్ని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు?

మండలంలో మొత్తం మండలంలో 9800 పశువులు ఉండగా, ఇప్పటి వరకు కొత్తపల్లి, లింబ్యాతండా, చౌదర్‌ఘట్టుతండా, వేముల, మున్ననూరు, మల్లాపూర్, కొత్తూరు, వల్లభురావుపల్లి గ్రామాల్లో 2125 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేశాం.

సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టిన చర్యలు?

వ్యాక్సినేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, లంబిస్కిన్ టీకాలు వేస్తున్నారు. జీవాలకు పీపీఆర్, దొమ్మవ్యాధి, నీలినాలుక వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరిగింది.

ఇప్పటి వరకు సర్జరీలు చేశారా?

సంవత్సర కాలం నుంచి పశువులకు డెలివరీ, గాయపడిన వాటికి చికిత్స, కొమ్ములు విరిగిన వాటికి, ట్యూమర్ కేసులకు సర్జరీలు చేపట్టడం జరిగింది.

పాడి రైతులకు మీరిచ్చే సందేశం?

పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోవాలి. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని. సమీకృత దాణా ఇవ్వడంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలి.

న్యూస్ బాక్స్

మునిసిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

దేవరకద్ర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన దేవరకద్ర మునిసిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి కృషి చేస్తున్నారని జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కొండ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ మునిసిపాలిటీ అభివృద్ధికి సీఎంతో మాట్లాడి రూ.18 కోట్లు, ముడా నుంచి రూ.కోటి మంజూరు చేయించినట్లు తెలిపారు. మునిసిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు గండీడ్ మండలంలో పరిగి ఎమ్మెల్యే పర్యటన

గండీడ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గండీడ్ మండలానికి పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జంగంరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం, ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు, రెడ్డిపల్లి గేటు దగ్గర నూతన షాప్ ప్రారంభోత్సవం, వెన్నచేడు మోడల్ స్కూల్‌లో ఖగోళ విజ్ఞాన ప్రయోగశాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే సొంతింటి కల సాకారం

గండీడ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల సొంతింటి కల సాకారం నెరవేరిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జానంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదలకు సొంత గూడు నిర్మించడమే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో హరిచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఫాతిమా, ప్రశాంత్ పాల్గొన్నారు.

'వీవోఏల జీతాలు పెంచాలి'

కోయిలకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు, ధాన్యం కొనుగోలు చేస్తున్న వీవోఏల జీత భత్యాలు పెంచి ప్రభుత్వం ఆదుకోవాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీవోఏలకు నెలకు రూ.26 వేల జీతంతో పాటు రూ.10 లక్షల ఆరోగ్య బీమా, రూ.20 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని కోరారు. మహిళా సంఘాల వివరాల నమోదుకు ట్యాబ్‌టాప్‌లు అందించి, పని వత్తిడి తగ్గించాలన్నారు. వీవోఏల సంఘం నాయకులు రాజు, ఆంజనేయులు, నరేష్, వెంకటేష్, లత, వెంకట్రాములు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మిడ్జిల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మిడ్జిల్ గ్రామానికి చెందిన పోషయ్య (55) బర్రెలను మేపుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో పోషయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు స్థానికులు తెలిపారు. ఇదే విషయాన్ని ఎస్‌ఐకి ఫోన్ చేయగా స్పందించలేదు.

దళారుల ప్రమేయం లేకుండా..

ప్రభుత్వ పథకాలు

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

» లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారుకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్ గ్రామీణ మండలానికి చెందిన చౌదర్‌పల్లి, మాచన్‌పల్లి తండా, ఫతేపూర్, ఓబ్లాయిపల్లి, కోడూర్, మాచన్‌పల్లి గ్రామాల్లో నిర్మించిన 180 డబుల్ బెడ్‌రూంలను అర్హులైన పేదలకు డ్రా పద్ధతిలో ఎంపిక చేసి, వారికి ఇళ్ల పట్టాలు అందించి, మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో నిరుపేదలకు ఇళ్లు ఇస్తామని మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు సీఎంను ఒప్పించి రూ.9 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. అర్హుల జాబితాలో ఎవరి ఒత్తిడి, ప్రమేయం లేదన్నారు. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు దోహదపడిందన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, రెండో విడతలో మరో 3,500 ఇళ్లు వస్తాయన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ట్రైనీ కలెక్టర్ ఇవాంజిలీన్, హౌజింగ్ పీడీ వైద్యం భాస్కర్, మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కరుణశ్రీరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాంచంద్రయ్య, పండరయ్య, గోవింద్ యాదవ్, షైబు, ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, నరేష్, రవిందర్, జి.ఆంజనేయులు, రామస్వామి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి » కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



భూత్పూర్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ హాజరై లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం అక్కడి నుంచి మండలంలోని తాటికొండ గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాజీ సర్పంచులు హర్యానాయక్, తిరుపతయ్య, కొండన్న, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పుల్లప్ప, సాయిలు, పద్మ, నాయకులు బాలవర్ధన్‌రెడ్డి, నర్సింహులు, వడ్డె శ్రీను, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో ఉమాదేవి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే చేరికలు

చిన్నచింతకుంట, : దేవరకద్ర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే జీఎంఆర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దమగ్నాపూర్‌లో మదనాపూర్ మండలం దుప్పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలకు కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. పారిశ్రామికంగా వెనుకబడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్‌తో పాటు అడ్డాకులకు డ్రై పోర్టు రాబోతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దుప్పల్లి గ్రామానికి ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొదటి విడతలో 50 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు.

● మూసాపేట : అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎలుసరి బాలయ్యకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ గురువారం పరామర్శించారు.

నేడు చలో ఇందిరా పార్కు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

భూత్పూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాలని కోరుతూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల నాయకులు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టే ధర్నాకు హాజరుకావాలని బీసీ సంఘం నాయకులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తమ్మన్నగౌడ్, బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని మద్దిగట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. బీసీ 42శాతం రిజర్వేషన్ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, మల్లయ్య, రాములు, రవికుమార్, శేఖర్, మాసయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

● పాలమూరు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించటానికి నేడు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రజా, దళిత సంఘాలు, సబ్బండ వర్గాల మద్దతు ఇస్తున్నట్లు టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఖలీల్, హనీఫ్, గట్టన్న, ఇమ్రాన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాలకృష్ణ, మహ్మద్, సలీం, జాంగీర్‌బాబా, హసన్‌పచావూస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మహాసభ వేదికగా నిలవాలి

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ మహాసభ వేదికగా నిలవాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. గురువారం పాలమూరు యూనివర్సిటీలోని పరిపాలన భవనం వీసీ చాంబర్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్లను విద్యార్థి నాయకులతో కలిసి విడుదల చేసి, మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని, విద్యా సంస్థలను కాపాడుకోవలసిన బాధ్యత విద్యార్థులదేనని, విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజాన్ని అధ్యాయనం చేయవల్సిన అవసరం ఉందన్నారు. పీడీఎస్‌యూ జాతీయ నాయకులు విజయ్‌కన్నా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, కార్యదర్శి సాంబశివరావు, ప్రశాంత్, శివ పాల్గొన్నారు.

ఐసెట్ కోచింగ్ తరగతులు ప్రారంభం

జడ్చర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తృతీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం ఐసెట్ కోచింగ్ తరగతులను ప్రారంభించారు. కళాశాలలోని తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో గణిత, ఆంగ్ల, వాణిజ్యశాస్త్ర విభాగాల సంయుక్త సహకారంతో 45 రోజుల పాటు తరగతులను నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ రామచేందర్‌రెడ్డి తెలిపారు. వాణిజ్యశాస్త్రం, గణితం, కంప్యూటర్ సైన్స్ చదువుతున్న తృతీయ సంవత్సరం విద్యార్థులు ఎంబీఏ, ఎంసీఏ లాంటి నిర్వహణ కోర్సుల ప్రవేశాలకోసం ఉచితంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సులేమాన్, డాక్టర్ రాజేశ్వరీ, ప్రవీణ్‌కుమార్, వీరప్రతాప్, జగన్, డాక్టర్ బి.నాగలక్ష్మీ పాల్గొన్నారు.



నీటికుంట కాదు.. అంతర్గత రోడ్డు

పైన కనిపిస్తున్న ఫొటో నీటి కుంట అనుకుంటే పొరపాటు. ఇది ప్రజలు రోజువారిగా తిరిగే అంతర్గత రోడ్డు. ఇదెక్కడో కాదు గండీడ్ మండలం పంచలింగాలతండా గ్రామపంచాయతీలోనిది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలో ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ వర్షపు నీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో బుధవారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడంతో గ్రామస్థులు మోటార్ సహాయంతో నీటిని తోడేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

\- గండీడ్

రైతు భరోసా అందజేయాలి

పాలమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసాను రైతుల అకౌంట్లో జమ చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త బుచ్చారెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనటానికి పెట్టుబడి అవసరం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

దేవరకద్ర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హజిలాపూర్ గ్రామంలో పోచమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా నిర్వహించారు. గురువారం రెండో రోజు ఆలయ ఆవరణలో అర్చకులు విగ్రహాలకు ప్రత్యేక హోమాలు, గణపతి పూజ, అభిషేకం నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

కొనసాగిన ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ధాన్యం క్రయ విక్రయాలు కొనసాగాయి. పెద్ద హంస 174 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.1779, కనిష్ఠంగా రూ.1759 పలికింది. ఆర్ఎన్ఆర్ 48 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2121చ కనిష్ఠంగా రూ.1935 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

సెల్‌ఫోన్ చోరీ అనుమానితుడిని పోలీసులకు అప్పగింత

జడ్చర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల కొత్త బస్టాండులో సెల్‌ఫోన్ చోరీ అనుమానితుడిని గురువారం స్టేషన్ మాస్టర్ రవీంద్రనాథ్, ఆర్టీసీ సెక్యూరిటీ లింగంపేట నర్సిములులు పట్టుకున్నారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన ఓ ప్రయాణికుడు కల్వకుర్తి నుంచి జడ్చర్ల కొత్త బస్టాండుకు వచ్చాడు. అనంతరం మహబూబ్‌నగర్ వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా సదరు ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను చోరీకి యత్నించాడు. ఈ సందర్భంలో సెల్‌ఫోన్ చోరీ అనుమానితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

11.45 గంటల వరకు తెరుచుకోని పశువైద్యశాల



ఆసుపత్రి ఎదుట మేకలతో పడిగాపులు కాస్తున్న రైతు

జడ్చర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి గాంధీ చౌరస్తా సమీపంలోని ప్రాంతీయ పశువైద్యశాల వద్ద గురువారం పాడిరైతు పడిగాపులు కాశారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నర్సింహులు మేకలకు టీకాలు వేయించేందుకు పశువైద్యశాలకు ఉదయం 9 గంటలకు వచ్చినా 11.45 గంటల వరకు పశువైద్యాధికారి రాకపోవడం, పశువైద్యశాఖ తెరుచుకోకపోవడంతో అక్కడే పడిగాపులు కాశాడు. ఈ అంశంపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో పశువైద్యాధికారి అరుణ పశువైద్యశాలకు చేరుకొని, పశువులకు టీకాలు వేసే కార్యక్రమం ఉన్నందున ఆలస్యమైందని తెలిపారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

» న్యాయవాదుల రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి



అనంతరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల సంక్షేమంతో పాటు వారి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామనని రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు. రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికవడంతో గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల సంఘం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ అందరి సహకారంలో జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఐదుసార్లు ఎన్నిక కావడం జరిగిందని, ఇదే స్ఫూర్తితో బార్‌కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో సభ్యుడిగా పోటీలో ఉన్నానని, మీరంతా సహకరించాలని కోరారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నామని, ప్రతీ న్యాయవాదికి ఇన్సూరెన్స్ కార్డు వచ్చేలా ప్రయత్నం చేస్తానన్నారు. నూతన కోర్టు భవన నిర్మాణ పనులకు నవంబరు 1వ తేదీన శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి శ్రీధర్‌రావు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, నాగోజీ, జాకీర్ హుస్సేన్, జగదీశ్వర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

జడ్చర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. జడ్చర్ల మునిసిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గురువారం మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రతీ లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా మోటివేషన్ చేయాలని, ఇంటి నిర్మాణానికి స్థలం తక్కువగా ఉన్న ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, దీన్ని లబ్ధిదారులకు వివరించాలన్నారు. ఇంటి ట్యాక్సులు చెల్లించని వారంతా చెల్లించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునే విధంగా వ్యాపారులకు వార్డు అధికారులు సూచించాలని, అందుకు తగ్గట్లుగా చర్యలు చేపట్టాలన్నారు. మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లో అక్రమ నిర్మాణాలు జరగకుండా బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు గమనించాలన్నారు. ఇళ్లను రివిజన్ చేయాలని, పీఎంఏఐ జియో ట్యాగింగ్ వంద శాతం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో మునిసిపల్ కార్యాలయ మేనేజర్ లక్ష్మన్న, ఆర్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రజాబాటలో విద్యుత్ అధికారులు



కోయిలకొండలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

పాలమూరు/కోయిలకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీజీ ఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఎస్ఈ వెంకటరమేష్, డీఈ లక్ష్మణ్‌నాయక్ బృందం 'ప్రజాబాట' చేపట్టి ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టౌన్-1, టౌన్-2, టౌన్-3 ఏరియాల్లో ఏడీ థౌర్యానాయక్, ఏఈలు హరినాథాచారి, ఆదిత్య, అరుణ్‌నాయక్ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి సమస్యలు గుర్తించారు. కాలనీవాసులు ప్రవీణ్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు. కోయిలకొండ మండల కేంద్రంలో విద్యుత్ ఏడీ మద్దిలేటి ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సమస్యలను గుర్తించి సరి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ముళ్ల కంపలు, చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఏఈ సత్తయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, సిబ్బంది షాహిమ్, బాబు, ఆసీఫ్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మైనార్టీ యువకులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శంకరచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రొఫెషనల్, ఐటీ రంగాల్లో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుబంధమైన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తామన్నారు. ఎంపికైన సంస్థలు శిక్షణ ఇవ్వడమే కాకుండా అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. సంస్థ రిజిస్ట్రేషన్, ఇన్ కార్పొరేషన్ సర్టిఫికెట్ వివరాలు, చిరునామా, సంప్రందిపు నెంబరు, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుబంధ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో నవంబరు 6వ తేదీలోపు సమర్పించాలన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యులు

మిడ్జిల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గాలికుంటు నివారణ టీకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి అనుప శివరాజ్ తెలిపారు. గురువారం మండలంలోని వల్లభురావుపల్లి, బోయిన్‌పల్లి, భైరంపల్లి గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 325 పశువులకు ఉచితంగా టీకాలు వేసినట్లు తెలిపారు. పశువైద్య సిబ్బంది నర్సింహులు, శ్రీనివాస్, గోపాల మిత్రలు యాదగిరి, నరసింహ, వేణుగోపాల్, మల్లేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

26 నుంచి ఆశావర్కర్ల సంఘం రాష్ట్ర మహాసభలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పాలమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26, 27వ తేదీల్లో ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర మహా సభలను జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, ఉపాధ్యక్షుడు భూపాల్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద మహా సభల పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. గోపాల్, కురుమూర్తి, దీప్లానాయక్, చంద్రకాత్, రాజ్, పద్మ, ఆశవర్కర్స్ నాయకురాలు సావిత్రి, ఏ.రాములు, ప్రశాంత్, శ్రీనాథ్, భరత్ పాల్గొన్నారు.

● జడ్చర్ల : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహా సభల పోస్టర్‌ను గురువారం జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్ వద్ద సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈనెల 26, 27వ తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాసభలకు సంబంధించిన వినతి పత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ మనుప్రియకు అందజేశారు. యూనియన్ నాయకులు సరోజ, షబానా, శ్రీదేవి, వసంత, గౌసియా, శ్యామల పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి : డీఈవో

మిడ్జిల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను గురువారం డీఈవో ప్రవీణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఆరా తీశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు అన్నారు. గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో సంఘం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్, సీపీఎస్ రద్దు తదితర సమస్యల పరిష్కారానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. 2009 విద్యాహక్కు చట్టం అమలు రాక ముందు ఉపాధ్యాయులుగా నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటులో జరిగిన పొరపాట్లను సరిచేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.